GV MALL shop & celebrate TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 97 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/- | సోమవారం 11 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ‘మోదీ మా డిమాండింగ్ బాస్’..: జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు

కేంద్ర విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ ప్రధాని మోదీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన డిమాండింగ్ బాస్ అంటూ వ్యాఖ్యానించారు.



ముంబయి, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): ప్రధాని నరేంద్రమోదీ గురించి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన తమ ‘డిమాండింగ్ బాస్’ అని అన్నారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రధానితో జరిగే సమావేశాలు ఏవిధంగా ఉంటాయో వివరించారు.”నిత్యం ప్రధాని మోదీతో మంత్రులకు సమావేశాలు జరుగుతుంటాయి. ఆయనతో సమావేశం అంటే చర్చించే విషయంపై కచ్చితమైన డేటాతో రావాల్సిందే. ఎందుకంటే, ఆ విషయం పై ఆయనకు పూర్తి అవగాహన ఉంటుంది. ప్రతి అంశంపై క్షుణంగా చర్చిస్తారు. ఆయన నిజాయతీ గల వ్యక్తి. ప్రధాని మా డిమాండింగ్ బాస్. నిజంగా ఆయనతో కలిసి పనిచేయడం నాకు ఎంతో ఆనందంగా ఉంటుంది” అని పేర్కొన్నారు.”ఉక్రెయిన్- రష్యా యుద్ధం వేళ భారతీయ విద్యార్థులను రక్షించేందుకు ఎంతో కృషి చేశారు. అక్కడ ఉన్నవారికి ఎలాంటి హాని కలగకుండా స్వదేశానికి తీసుకురావాలంటూ మమ్మల్ని ఆదేశించారు.ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది దేశాధినేతలతో భారత్ సత్సంబంధాలు ఏర్పరుచుకుంది. ట్రంప్ సహా ఒబామా, జోబైడెన్ హయాంలో అమెరికాతో స్నేహబంధం కొనసాగుతోంది. ఎంతమంది నేతలు మారినా ఆ దేశంతో బంధం స్థిరంగా ఉంది. అందుకు ప్రధాని మోదీనే కారణం” అని జైశంకర్అన్నారు. మరోవైపు.. ముంబయిలో నిర్వహించిన ఇండియా-రష్యా బిజినెస్ ఫోరంలో పాల్గొన్న విదేశాంగ మంత్రి ప్రసంగించారు.భారత్- రష్యా పరిష్కరించుకోవాల్సిన సమస్యలు చాలా ఉన్నాయన్నారు. ప్రతిపాదిత ఇండియా-యురేషియన్ ఎకనామిక్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై చర్చలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్యాంకింగ్, పేమెంట్, రవాణా సవాళ్లు, బీమా, మార్కెట్ ప్రవేశాలు తదితర సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 66 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యం.. 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల లక్ష్యానికి చేరుకోవాలన్నారు. అందుకు ఇరుదేశాల మధ్య సమస్యలను త్వరగా పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్ కూడా పాల్గొన్నారు.

# బడ్జెట్ క్ ఏపీ క్యాబినెట్ ఆమోదం

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో 2024-25 వార్షిక బడ్జెట్ క్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది.



అమరావతి, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో 2024-25 వార్షిక బడ్జెట్ క్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మరికాసేపట్లో ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.అంతకుముందు వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. మంత్రులు నారా లోకేశ్, నారాయణ, పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, సవిత, తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళి అర్పించారు. రాజధాని రైతులను మంత్రి నారా లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. అమరావతి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారంటూ అభినందించారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చే దిశగా బడ్జెట్ ఉంటుందని తెదేపా నేతలు తెలిపారు.



## కేసుల నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్ ఢిల్లీ టూర్: మంత్రి పొన్నం

తనపై వస్తున్న ఆరోపణలు, కేసుల నుంచి తప్పించుకునేందుకే భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఢిల్లీ టూర్కి వెళ్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.



హైదరాబాద్, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): తనపై వస్తున్న ఆరోపణలు, కేసుల నుంచి తప్పించుకునేందుకే భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఢిల్లీ టూర్కి వెళ్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బాధ్యతగల ప్రజాప్రతినిధిగా పోలీసుల విచారణకు కేటీఆర్ సహకరించాలన్నారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేంద్ర సహాయం కోసం కలిసి ఢిల్లీ వెళ్లామంటే.. ప్రతిపక్షాలు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు మాత్రం కేటీఆర్ ఢిల్లీకి పరుగెడుతున్నారు. ఢిల్లీకి వెళ్లి ‘అమృత్ పథకంపై ఫిర్యాదు చేస్తామని కేటీఆర్ చెబుతున్నారు. కార్ రేసు సంబంధించిన విచారణకు గవర్నర్ అనుమతి కోరాం. మేం ఎవర్నీ జైల్లో పెడతాం అనడం లేదు. తన రక్షణ కోసం కేంద్రం వద్ద మోకరిల్లేందుకు కేటీఆర్ ఢిల్లా వెళ్లారు. అలా ప్రజల దృష్టిని మరలిస్తున్నారు. అమృత్ పథకంలో అవినీతి జరిగితే కేంద్రానికి ఫిర్యాదు చేయవచ్చు. కానీ, మీ మీద జరిగే విచారణను తప్పించుకునేందుకే ఢిల్లీ వెళ్తున్నట్లు తెలుస్తోంది. విచారణకు సహకరించండి.. మీ చిత్తశుద్ధి నిరూపించుకోండి.ఈ నెల 14 నుంచి ఏడాది పాలన విజయోత్సవాలు జరుపుతాం. ప్రభుత్వ విజయాలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రతి మంచి పనిని ప్రజలకు వివరిస్తాం. రవాణాశాఖకు మరింత గౌరవం పెరిగేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే తెలంగాణ రవాణాశాఖ లోగోను విడుదల చేస్తాం” అని పొన్నం వెల్లడించారు.

## ప్రతిపక్ష హోదా ఇస్తేనే.. అసెంబ్లీకి వస్తాననడం సిగ్గుచేటు: షర్మిల

ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతాననడం వైకాపా అధ్యక్షుడు జగన్ అవివేకం, అజ్ఞానానికి నిదర్శనమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు.




విజయవాడ, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతాననడం వైకాపా అధ్యక్షుడు జగన్ అవివేకం, అజ్ఞానానికి నిదర్శనమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ఆయన తీరు అత్త మీద కోపం దుత్తపై చూపినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు జగన్ ను ఉద్దేశిస్తూ షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు.“ప్రజలు ఓట్లేసింది.. అసెంబ్లీ మీద అలగడానికో, మైకు ఇస్తేనే వెళ్తానని మారాం చేయడానికో కాదు. మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపించింది ఇంట్లో కూర్చొని సొంత మైకుల్లో మాట్లాడేందుకు కాదు. మీ స్వయం కృతాపరాధం ప్రతిపక్ష హోదాకి దూరం చేస్తే.. ఆ హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతాననడం మీ అవివేకం, అజ్ఞానానికి నిదర్శనం. అసెంబ్లీ ప్రజాస్వామ్య దేవాలయం. ప్రజా సమస్యల పట్ల అధికార పక్షాన్ని నిలదీసేందుకు ప్రజలు ఇచ్చిన గొప్ప అవకాశం. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా గొంతుకయ్యే అవకాశం వైకాపాకు ప్రజలు ఇస్తే.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తామనడం సిగ్గు చేటు. ప్రతిపక్షం లేకుంటే సభలోనే ప్రజాపక్షం అవ్వాలనే ఇంగితం కూడా లేకపోవడం బాధాకరం. 1994లో కాంగ్రెస్ పార్టీ 26 సీట్లకే పరిమితమైనా కుంగిపోలేదు. మీలా హోదా కావాలని మారాం చేయలేదు. 26 మంది సభ్యులతో సభలో ప్రజల పక్షంగా నిలబడ్డాం. 2014లో కేంద్రంలో 44 సీట్లకే పరిమితమైనా.. 2019లో 52 సీట్లే వచ్చినా ప్రతిపక్ష హోదా కావాలని అడగలేదు. హోదా లేకున్నా రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ప్రజా సమస్యలపై తమ గొంతు వినిపించారు. ఇప్పటికైనా అసెంబ్లీకి వెళ్లండి. ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీయండి. అసెంబ్లీకి వెళ్లే దమ్ము, ధైర్యం లేకుంటే వైకాపా శాసనసభా పక్షం మొత్తం రాజీనామాలు చేయండి. అప్పుడు ఇంట్లో కాదు.. ఎక్కడైనా కూర్చుని తాపీగా మాట్లాడుకోండి” అని షర్మిల ఘాటుగా పేర్కొన్నారు.

## రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు: సీఎం రేవంత్ రెడ్డి

ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.



హైదరాబాద్, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వారిపై ఎస్మా కింద చర్యలు తీసుకోవాలన్నారు. పంటల కొనుగోళ్లలో మోసాలకు పాల్పడకుండా చూడాలన్నారు. రైతులను వేధిస్తే ఊరుకునేది లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా కలెక్టర్లు చూడాలన్నారు. ఇబ్బందులుంటే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించాలని రేవంత్రెడ్డి చెప్పారు.

## పత్తి రైతుల ఆందోళన.. రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా?.. లేనట్లా?: హరీశ్ రావు

తెలంగాణ మార్కెటింగ్ శాఖ అలసత్వం, సమన్వయలోపంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారని మాజీ మంత్రి హరీశ్రావు ధ్వజమెత్తారు.



హైదరాబాద్, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ మార్కెటింగ్ శాఖ అలసత్వం, సమన్వయలోపం వల్ల పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారని మాజీ మంత్రి హరీశ్రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణం తేమశాతం సహా ఇతర నిబంధనల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తేవాలని, అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కనీస మద్దతు ధరకు అమ్ముకోలేని దుస్థితికి రాష్ట్ర రైతాంగాన్ని తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మండిపడ్డారు. అకాల వర్షాలతో దిగుబడి తగ్గి నష్టపోయిన పత్తి రైతులపై ప్రభుత్వం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఎక్స్ వేదికగా విమర్శించారు. సీసీఐ, ప్రభుత్వ వైఖరికి నిరసనగా పత్తి కొనుగోళ్లు చేయబోమని రాష్ట్ర జిన్నింగ్, మిల్లుల యాజమాన్యాలు సమ్మె ప్రకటిస్తే సమస్యకు పరిష్కారం చూపే కనీస ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటు అని హరీశ్ రావు అన్నారు. పత్తి రైతులు రోడ్ల పైకి వచ్చి ఆందోళన చేస్తుంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా?.. లేనట్లా? అని ప్రశ్నించారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు ఫొటోలకు ఫోజులిచ్చిన మంత్రులు ఎందుకు మౌనంగా ఉన్నారని విమర్శించారు. పంట చేతికి వచ్చిన ఈ సమయంలో రైతుల జీవితాలతో చెలగాటమాడటమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. మిల్లుల వద్దకు చేరిన పత్తి లారీల లోడ్లతో రైతులు ఎన్ని రోజులు ఎదురుచూడాలని హరీశ్రావు నిలదీశారు. పక్క రాష్ట్రాల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడానికి వెళ్లే సీఎం, మంత్రులకు రైతుల సమస్యలను పట్టించుకొనే సమయం లేదా అని ప్రశ్నించారు.

## గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్


తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది.



అమరావతి , నవంబర్ 11 ( రిపబ్లిక్ న్యూస్): తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ డిసెంబర్ 5వ తేదీన జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18 వరకు నామినేషన్ల స్వీకరణ, 19న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు ఉంటుంది. డిసెంబర్ 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఈసీ తెలిపింది.

## ఆరాంఘర్ లో భారీ అగ్ని ప్రమాదం

నగరంలోని ఆరాంఘర్ సోమవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది.



హైదరాబాద్, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): నగరంలోని ఆరాంఘర్ సోమవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మహీంద్రా షోరూమ్ వెనుక ప్రాంతంలో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 2 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలు అదుపు చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు సమాచారం.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# నంద్యాల డిఎస్పీగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన పి శ్రీనివాస్ రెడ్డి



నంద్యాల క్రైం, నవంబర్ 11, (రిపబ్లిక్ న్యూస్): 1996 బ్యాచ్ కుచెందిన శ్రీనివాస్ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్గా పోలీస్ శాఖలో ప్రవేశించి 2007లో ఇన్స్పెక్టర్గా పదోన్నతి పొంది కర్నూలు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించారు. 2020లో డిఎస్పీగా పదోన్నతి పొంది పత్తికొండ డిఎస్పీగా విధులు నిర్వహించారు. ఇటీవల డిఎస్పీల బదిలీలో భాగంగా నంద్యాల డిఎస్పీగా శ్రీనివాస్ రెడ్డిని నియమిస్తూ డిజిపి ద్వారక తిరుమల రావు ఉత్త-ర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. డిఎస్పి శ్రీనివాస్ రెడ్డిని రెండో పట్టణ సీఐ ఇస్మాయిల్, ఎస్ఐలు సుధాకర్ రెడ్డి సురేష్ డిఎస్పి కార్యాలయం సిబ్బంది జంబులయ్య సురేష్ రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల సభ్యుల పరిధిలో పూర్తిస్థాయిలో అసాంఘిక కార్యకలాపాల అదుపునకు నేరాల అదుపునకు కృషి చేస్తామన్నారు

# నందాల ఐఎంఏ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం


## వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతి ప్రధానం



నంద్యాల నవంబర్ 11 ( రిపబ్లిక్ న్యూస్): స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి,భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం జాతీయ విద్యా దినోత్సవం ఐఎంఏ నంద్యాల,లయన్స్ క్లబ్ నంద్యాల సంయుక్త నిర్వహణలో రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో డాక్టర్ మధుసూదన రావు, నిజాముద్దీన్ ల సహకారం తో నిర్వహించారు.అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల భాషలలో"మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం- సందేశం" అన్న అంశంపై గత శని వారం నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విజేతలకు మౌలానా ఆజాద్ మహాత్మా గాంధీ జీవిత చరిత్ర పుస్తకాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రవికృష్ణ, ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ సూదనరావు,లయన్స్ క్లబ్ నంద్యాల అధ్యక్షులు నిజాముద్దీన్, కార్యదర్శి శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, ఉపాధ్యక్షులు సోమేశుల నాగరాజు, , రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సుబ్బయ్య , పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ ,డాక్టర్ మధుసూదన రావు,నిజాముద్దీన్ మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ స్వతంత్ర ఉ ద్యమంలో కీలకపాత్ర వహించారని, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఉత్తమమైన విద్యార్థులను తీర్చిదిద్ది భారత దేశ అభివృద్ధికి దోహదం చేసే విధంగా విద్యా విధానం ఉండాలని క్షించారు.విజేతల వివరాలు. తెలుగులో శ్రావణి, షబీర, ఆశ్రిత , ఆంగ్లంలో తేజ వర్షిని, దీక్షిత, నాసియా లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా, తెలుగులో శ్రావణి ,లక్ష్మీ నందు ఆంగ్లంలో జోస్విని, రాగ చైత్ర స్పెషల్ జ్యూరీ బహుమతులు అందుకున్నారు. మొత్తం పది బహుమతులు బాలికలే అందుకోవడం విశేషం.

# జాతీయ రహదారులు, రైల్వేల నిర్మాణాల భూసేకరణను పూర్తి చేయండి. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

## అన్ని పారామీటర్లలో నంద్యాల జిల్లాను టాప్ ఫైవ్ లో వుంచండి.



నంద్యాల ప్రతినిధి, నవంబరు 11, రిపబ్లిక్ న్యూస్ :జాతీయ రహదారులు, రైల్వే నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ లో వున్న భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో ప్రగతి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జాతీయ రహదారులు, రైల్వే నిర్మాణాలకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కూడ సమీక్షిస్తున్నారని జిల్లాలో పెండింగ్లో ఉన్న భూసేకరణను పూర్తి చేసేందుకు ఆర్డీఓలు తాసిల్దార్లతో సమీక్షించి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. త్వరలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉన్న నేపథ్యంలో అభివృద్ధికి సంబంధించి అన్ని పారామీటర్లలో రాష్ట్రంలో నంద్యాల జిల్లా టాప్ ఫైవ్ లో ఉండాలని... దిగువ పది జిల్లాలలో ఉంటే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అన్ని పారామీటర్లలో గ్రీన్ మార్క్ ఉండేలా పనులు చేపట్టి పూర్తి చేసేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధి హామీలో లేబర్ మొబలైజేషన్, దినసరి వేతన రేటు పెంపు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, హార్టికల్చర్ ప్లాంటేషన్ తదితర అంశాలలో వెనుకబడి ఉన్నామని వచ్చే గురువారం నాటికి వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలని ఏపీడీలను కలెక్టర్ ఆదేశించారు. గోకులం షెడ్లు, పల్లె వనాలు, సోకు పిట్ల నిర్మాణాలకు మంజూరు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని కలెక్టర్ ప్రశ్నిస్తూ సంబంధిత ప్రతిపాదనలను వెంటనే పంపాలని కలెక్టర్ ఆదేశించారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలలో మంజూరు అయిన 1026 సీసీ రోడ్ల నిర్మాణాలకు గాను 170 పనులు గ్రౌండ్ అయ్యి 33 పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన నిర్మాణాలన్నీ గ్రౌండింగ్ కావడంతోపాటు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతోపాటు 15 రోజుల పాటు క్యూరింగ్ కచ్చితంగా చేయాలని కలెక్టర్ సూచించారు. అపార్ ఐడి జనరేటర్ కు సంబంధించి విద్యార్థుల పుట్టిన తేదీ సర్టిఫికెట్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని డీఈఓ, డివిఇఓ లను కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడి




కేంద్రాలలో టాయిలెట్లు త్రాగునీటి వసతి, సోక్ పిట్ల నిర్మాణాల పనుల ప్రగతిలో వెనుకబడి ఉన్నామని ఇకపై రోజువారి ప్రగతిపై నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలలో వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలు 25 శాతం ఉన్నట్లు సర్వేలో వెల్లడైందని... ఇందుకు గల కారణాలను వైద్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ లు విశ్లేషించి నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉల్లాస్ పథకం కింద వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చదువుకున్న ఎస్ హెచ్ జి మహిళలను విద్యా వాలంటీర్లుగా గుర్తించి ఉచితంగా విద్య బోధించేందుకు చర్యలు తీసుకోవాలని డిఆర్డిఏ పిడి, ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో 26,000 మంది వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని ఈ మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీశైలం పర్యటనను అధికారులందరూ టీం స్పిరిట్ తో విజయవంతం చేశారని ఇదే స్ఫూర్తి మున్ముందు కూడా కొనసాగించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమానికి గైరాజరైన కొంతమంది జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈనెల 14 నుండి అన్ని గ్రామాలలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అందరికీ క్యాన్సర్ పరీక్షలు, క్యాన్సర్ పై విజయం - స్క్రీనింగ్ తో సాధ్యం అనే గోడపత్రికను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు.

# రూ.43,402 కోట్లతో ఏపీ వ్యవసాయ బడ్జెట్

ఏపీ అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్ను ప్రవేశపెట్టారు.



అమరావతి, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): ఏపీ అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్ను ప్రవేశపెట్టారు. రాష్ట్రానికి వ్యవసాయం వెన్నెముక లాంటిదని ఆయన తెలిపారు. 62 శాతం జనాభా వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడిందని చెప్పారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. భూసార పరీక్షలకు తిరిగి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఇందుకు రిమోట్ సెన్సింగ్ సాంకేతికత ఉ పయోగిస్తామని చెప్పారు. విత్తనాలు, సూక్ష్మ పోషక ఎరువులు రాయితీపై అందిస్తున్నామన్నారు. ప్రాథమిక పరపతి సంఘాల ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నామని వివరించారు.

వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులిలా..
రాయితీ విత్తనాలకు - రూ.240 కోట్లు
భూసార పరీక్షలకు - రూ.38.88 కోట్లు
విత్తనాల పంపిణీ - రూ.240 కోట్లు
ఎరువుల సరఫరా రూ.40 కోట్లు
పొలం పిలుస్తోంది - రూ.11.31 కోట్లు.
పకృతి వ్యవసాయం - రూ.422.96 కోట్లు
డిజిటల్ వ్యవసాయం - రూ.44.77 కోట్లు
వ్యవసాయ యాంత్రీకరణ - రూ.187.68 కోట్లు
వడ్డీ లేని రుణాలకు - రూ.628 కోట్లు
అన్నదాత సుఖీభవ 5. 4,500 5
రైతు సేవా కేంద్రాలకు - రూ.26.92 కోట్లు
ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ - రూ.44.03 కోట్లు
పంటల బీమా - రూ.1,023 కోట్లు
వ్యవసాయ శాఖ 5. 8,564.37
ఉద్యాన శాఖ . 3469.47
పట్టు పరిశ్రమ - రూ.108.4429 కోట్లు
వ్యవసాయ మార్కెటింగ్ - రూ.314.80 కోట్లు
సహకార శాఖ 5. 308.2655 -
ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం - రూ.507.038 కోట్లు
ఉద్యాన విశ్వవిద్యాలయం- రూ.102.227 కోట్లు
శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం- రూ.171.72 కోట్లు
మత్స్య విశ్వవిద్యాలయం - రూ.38 కోట్లు
పశుసంవర్ధక శాఖ 5. 1,095.71 కోట్లు
మత్స్య రంగం అభివృద్ధి - రూ.521.34 కోట్లు
ఉచిత వ్యవసాయ విద్యుత్ రూ.7241.30 కోట్లు
ఉపాధి హామీ అనుసంధానం- రూ.5,150కోట్లు
ఎన్టీఆర్ జలసిరి - రూ.50 కోట్లు
నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ- రూ.14,637.03 కోట్లు

# 'సూపర్ సిక్స్' హామీల అమలుకు చర్యలు: మంత్రి పార్థసారథి

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పటికీ బడ్జెట్ ప్రవేశపెట్టిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి అన్నారు.



అమరావతి, నవంబర్ 11 ( రిప.బ్లిక్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పటికీ బడ్జెట్ ప్రవేశపెట్టిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. గత ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని.. వ్యవస్థలను ధ్వంసం చేసి పరిపాలన అస్తవ్యస్తం చేసిందని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వైకాపా సర్కారు చిన్నాభిన్నం చేసిందన్నారు. గత వైకాపా సర్కారు రూ.1.35 లక్షల కోట్ల మేర బకాయిలు పెట్టి వెళ్లిపోయిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఈ మేరక్కు బడ్జెట్కు సంబంధించిన అంశాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో పార్థసారథి మాట్లాడారు. "సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే రెండు ప్రధాన హామీలు అమలు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచాం. ఉచిత గ్యాస్ హామీ అమలులో భాగంగా రూ. 840 కోట్ల నిధులు మంజూరు చేశాం. మరో రెండు పథకాల అమలు కోసం ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాం" అని మంత్రి తెలిపారు.

# మాజీ మంత్రి కాకాణిని విచారిస్తున్న పోలీసులు

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డిని పోలీసులు వెంకటాచలం పోలీస్ స్టేషన్లో విచారిస్తున్నారు.



నెల్లూరు, నవంబర్ 11 ( రిపబ్లిక్ న్యూస్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డిని పోలీసులు వెంకటాచలం పోలీస్ స్టేషన్లో విచారిస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబుపై సోషల్ మీడియాలో కాకాణి అసభ్యకర వ్యాఖ్యలను పోస్టు చేశారు. దీనిని తీవ్రంగా పరిగణించిన తెదేపా నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. కేటాయింపులిలా..

ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ను ప్రవేశపెట్టారు.



అమరావతి, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి రూ.2,94,427.25 కోట్లతో వార్షిక బడ్జెట్ను సభ ముందుకు తీసుకొచ్చారు. బడ్జెట్లో రెవెన్యూ వ్యయం అంచనా రూ.2,35,916.99 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ.32,712.84 కోట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ.34,743.38 కోట్లు, ద్రవ్య లోటు రూ.68,742.65 కోట్లుగా పయ్యావుల తన బడ్జెట్ ప్రసంగం ద్వారా వెల్లడించారు. బడ్జెట్లో వివిధ కీలక రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు.

వివిధ రంగాలకు కేటాయింపులు ఇలా..
పాఠశాల విద్య రూ.29,909కోట్లు
మహిళ, శిశు సంక్షేమం రూ.4,285కోట్లు
మానవ వనరుల అభివృద్ధి రూ.1,215కోట్లు
ఉన్నత విద్యకు రూ.2,326 కోట్లు
ఆరోగ్య రంగానికి రూ.18,421కోట్లు
పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.16,739 కోట్లు
పట్టణాభివృద్ధి రూ.11490 కోట్లు
గృహనిర్మాణం రూ.4,012కోట్లు
జలవనరులు రూ.16,705కోట్లు
పరిశ్రమలు, వాణిజ్యం రూ.3,127కోట్లు
ఇంధన రంగం రూ.8,207కోట్లు
రోడ్లు, భవనాలకు రూ.9,554కోట్లు
యువజన, పర్యాటక, సాంస్కృతిక రూ.322కోట్లు
పోలీస్ శాఖకు రూ.8,495 కోట్లు
పర్యావరణ, అటవీశాఖకు రూ.687కోట్లు

# ఆర్జీయూకేటీలో విద్యార్థిని ఆత్మహత్య

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది.

బాసర, నవంబర్, 11 (రిపబ్లిక్ న్యూస్): నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ లో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్కు చెందిన సాయి ప్రియ పీయూసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఇద్దరు స్నేహితులతో కలసి క్యాంపస్ వసతి గృహంలోనే ఉంటుంది. సోమవారం ఉదయం తన ఇద్దరు స్నేహితురాళ్లు అల్పాహారం కోసం వెళ్లగా.. గదిలో సాయి ప్రియ మాత్రమే ఉంది. వారు తిరిగి వచ్చే చూసేసరికి ఫ్యాన్కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి చేతిలో ఓ



సూసైడ్ నోట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్జీయూకేటీకి ఇటీవల నూతన ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ నియామకం తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడం తొలిసారి. పోలీసులు మరిన్ని వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

# వర్రా రవీందర్ రెడ్డిని విచారించిన ఎస్పీ విద్యాసాగర్

వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్ రెడ్డిని కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.



సీకే దిన్నె, నవంబర్ 11 ( రిపబ్లిక్ న్యూస్): వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రరెడ్డి కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. వైఎస్సార్ జిల్లా సీకే దిన్నె పోలీస్ స్టేషన్లో ఉన్న రవీందర్ను నేడు కడప కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ సీకే దిన్నె చేరుకుని వర్రా రవీంద్రరెడ్డిని విచారించారు. సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనితపై అసభ్యకర పోస్టుల కేసులో పలు అంశాలపై నిందితుడి నుంచి ఆరా తీశారు. మరోవైపు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కడప చేరుకున్నారు.

# చావు నోట్లోకి వెళ్లి.. బండి సంజయ్ చొరవతో బయటపడి..

ప్రమాదవశాత్తు లారీ కింద ఇరుక్కున్న మహిళ చావు ముంగిట వరకు వెళ్లి కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతోప్రాణాలతో బయటపడింది.



సింగాపూర్, నవంబర్ 11 ( రిపబ్లిక్ న్యూస్): ప్రమాదవశాత్తు లారీ కింద ఇరుక్కున్న మహిళ చావు ముంగిట వరకు వెళ్లి కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటన హుజూరాబాద్ లో జరిగింది. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఖెల్లడ గ్రామానికి చెందిన దివ్యశ్రీ అనే మహిళ ప్రమాదవశాత్తు లారీ కింద ఇరుక్కుంది. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో హుజూరాబాద్ సమీపంలోని సింగాపూర్ శివారులో డ్రైవర్ లారీని ఆపేశాడు. అదే సమ-యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ములుగు వెళ్తూ.. ఘటనా స్థలి వద్ద ఆగారు. లారీ కింద టైర్ పక్కన రాడ్డులో జుట్టు చిక్కుకొని రక్తమోడుతూ వేళాడుతున్న దివ్యశ్రీని చూసి ధైర్యం చెప్పారు. జుట్టు కత్తిరించి ఆమెను బయటకు తీయాలని స్థానికులకు సూచించారు. వెంటనే ఆమెను కరీంనగర్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించారు. దివ్యశ్రీ వైద్యఖర్చులను తానే భరిస్తానని ఆస్పత్రి వైద్యులకు బండి సంజయ్ చెప్పారు.

# చరిత్రలో నేటి ప్రత్యేకత

- జాతీయ విద్యా దినోత్సవం
- **1872:** హిందుస్తానీ సంగీతంలోని కిరాణా ఘరానాకు చెందిన వారిలో ముఖ్యుడు అబ్దుల్ కరీంఖాన్ జననం (మ.1937).
- **1888:** స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జననం (మ.1958).
- **1918:** బిర్లాకుటుంబానికి చెందిన పారిశ్రామికవేత్త కృష్ణ కుమార్ బిర్లా జననం (మ.2008),
- **1970:**పద్మభూషణ్మాడపాటి హనుమంతరావు మరణం (జ.1885).
- **1985:** భారత వన్డే, ట్వంటీ-20 క్రికెట్ ఆటగాడు రాబిన్ ఊతప్ప జననం.
- **2002:** గ్రంథాలయోద్యమ నేత, విశాలాంధ్ర ప్రచారకుడు కోదాటి నారాయణరావు మరణం (జ.1914)


అబ్దుల్ కరీంఖాన్


అబుల్ కలామ్ ఆజాద్


హనుమంతరావు


రాబిన్ ఊతప్ప


కోదాటి నారాయణరావు

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# భారత్ పై ఆల్రౌండ్ ప్రదర్శన.. ఐపీఎల్ వేలంలో హాట్కేక లు : డేల్ స్టెయిన్

*మెగా వేలంలో ఎవరిని తీసుకుంటారనేది ఆసక్తికరమే. అయితే, ఈ రెండు వారాల్లో నాణ్యమైన ఆటతీరు ప్రదర్శిస్తే.. వారు హాట్ కేకుల్లా అమ్ముడైపోవడం ఖాయం.*



నవంబర్ 24, 25 తేదీల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025) మెగా వేలం జరగనుంది. దాదాపు పదిహేను వందల మందికి పైగా క్రికెటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ పది రోజుల్లో క్రికెటర్లు ఆడే ప్రతి మ్యాచ్లోనూ అత్యుత్తమ ప్రదర్శన చేస్తే.. వారిని తీసుకొనేందుకు ఐపీఎల్ ఫ్రాంచైజీలు మొగ్గ చూపుతాయనడంలో ఏ సందేహం లేదు. తాజాగా దక్షిణాఫ్రికా- భారత్ టీ20 సిరీస్ జరుగుతోంది. తొలి మ్యాచ్లో టీమిండియా ఘన విజయం సాధించగా.. రెండో టీ20లో సఫారీ జట్టు గెలిచింది. ఈ మ్యాచ్లో సౌతాఫ్రికా ఆటగాడు గెరాల్డ్ కోయిట్జ్ ఆల్ రౌండ్ ప్రదర్శనతో తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ క్రమంలో అతడిపై ప్ర శంసల వర్షం కురిపించిన మాజీ పేసర్ డేల్ స్టెయిన్ ఐపీఎల్ వేలంపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టాడు. "కోయిట్జీ బౌలింగ్ బాగుంది. బౌ ండరీలూ కొట్టాడు. భారత్తో సిరీస్లో ఇలాగే కొనసాగితే.. ఐపీఎల్ మెగా వేలంలో అందరి దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంది. ఆల్రౌండర్లకు మంచి డిమాండ్ ఉంటుందని అందరికీ తెలుసు" అని డేల్ స్టెయిన్ పోస్టు పెట్టాడు. రెండో టీ20లో తొలుత భారత్ 20 ఓవర్లలో 124/6 స్కోరు చేసింది. గెరాల్డ్ కోయిటీ 4 ఓవర్ల స్పెల్ లో వికెట్ పడగొట్టి 25 పరుగులు ఇచ్చాడు. అనంతరం లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు రెండు ఫోర్లు, సిక్స్ మ్యాచ్ ఫలితాన్ని తిప్పేశాడు. కేవలం 9 బంతుల్లోనే 19 పరుగులతో అజేయంగా నిలిచాడు. దీంతో దక్షిణాఫ్రికా 125 పరుగుల టార్గెట్ను 19 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మరోవైపు వరుసగా విఫలమవుతూ ఉన్న భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మపై సోషల్ మీడియా వేదికగా పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. రుతురాజ్ వంటి నాణ్యమైన ఆటగాడిని పక్కన పెట్టి మరీ అభిషేకక్కు అవకాశాలు ఇవ్వడం సమంజసం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు అతడు ఆడిన 9 టీ20ల్లో ఒక్క సెంచరీ మినహా.. మరెప్పుడూ 20 పరుగుల మార్క్ ను దాటలేదు. ఐపీఎల్లో మాత్రం భారీగా పరుగులు చేసే అతడు.. అంతర్జాతీయ క్రికెట్లో లో వరుసగా తేలిపోవడం అభిమానులను నిరుత్సాహానికి గురిచేస్తోంది. చేయలేదు.

ఐపీఎల్ 2024 సీజన్లో 16 మ్యాచుల్లో 484 పరుగులు చేసిన అతడి స్ట్రైక్రేట్ 200కి పైగా ఉంది. జాతీయ జట్టుకు ఆడేటప్పుడు మాత్రం గత మూడు మ్యాచుల్లో కనీసం రెండంకెల స్కోరూ

# ముద్దు సన్నివేశం.. మూడు రోజులపాటు షూట్

*ఆమిర్ఖాన్ కరిష్మా కపూర్ జంటగా నటించిన 'రాజా హిందుస్తానీ'. ఇందులోని ముద్దు సన్నివేశాన్ని దాదాపు మూడు రోజులపాటు షూట్ చేశారు.*



బాలీవుడ్ ప్రేమకథా చిత్రాలకు కొదవే లేదు. గతంలో అక్కడ ఎన్నో లవ్స్టోరీలు తెరకెక్కి.. సినీ ప్రియుల మది దోచుకున్నాయి. అలాంటి ప్రేమకథా చిత్రాల్లో 'రాజా హిందుస్తానీ' నటించిన ఈ చిత్రానికి ధర్మేష్ దర్శన్ దర్శకత్వం వహించారు. 1996లో విడుదలైన ఇది బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టి సూపర్ హిట్ మూవీగా నిలిచింది. ఈ ఏడాదితో ఇది విడుదలై 28 ఏళ్లు అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. సినిమా విశేషాలు, ముఖ్యంగా ఇందులోని ముద్దు సన్నివేశం గురించి మాట్లాడారు."ఆ రోజుల్లో మా చిత్రాన్ని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. నటీనటులతోపాటు మ్యూజిక్కు విశేష స్పందన లభించింది. ఆమిర్, కరిష్మాతో వర్క్ చేసిన రోజులను ఎప్పటికీ మర్చిపోను. ఆమె చాలా చలాకీగా ఉండేది. నాకు కావాల్సిన విధంగా యాక్ట్ చేసేది. కథలో భాగంగా నటీనటుల మధ్య ముద్దు సన్నివేశాన్ని చిత్రీకరించాల్సి వచ్చింది. ముందే ఆ విషయాన్ని వారికి తెలియజేశా. అప్పటికి ఆమె ఏ చిత్రంలోనూ కిస్ సీన్ చేయలేదు. దానివల్ల మొదట్లో చాలా కంగారు పడింది. కరిష్మాకు కాస్త ధైర్యం చెప్పడం కోసం ఆమె తల్లిని సెట్కు పిలిపించాం. మూడు రోజుల పాటు ఆ సీన్ షూట్ చేశాం. దాదాపు 47 రీటేక్స్ తీసుకున్నాం. షూట్ జరిగినన్ని రోజులు ఆమె తల్లి సెట్లోనే ఉన్నారు. ఆరోజుల్లో లిప్క్ సన్నివేశాలు చాలా అరుదుగా ఉండేది. దాంతో, సినిమా విడుదలయ్యాక ఇదొక ఐకానిక్ కిస్ సీన్గా మారింది" అని తెలిపారు. ఇదే విషయంపై గతంలో కరిష్మా కపూర్ మాట్లాడారు. ఆ సీన్ త్రీకరించినప్పుడు తాను ఎంతో అసౌకర్యంగా ఫీలయ్యానని చెప్పారు. సీన్ ఎప్పుడు పూర్తవుతుందా? అని ఎదురుచూశానన్నారు. పేదింటి కుర్రాడు.. ధనవంతుల అమ్మాయి మధ్య అనుకోకుండా ప్రేమ పుట్టడం.. పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకోవడం.. ఆ తర్వాత వారు ఎదుర్కొన్న సమస్యలు ఏమిటనే నేపథ్యంలో 'రాజా హిందుస్తానీ' రూపుదిద్దుకుంది. ఈ చిత్రంలో హీరోయిన్గా మొదట జుహీ చావ్లా, ఐశ్వర్య రాయ్ను అనుకున్నారు. చివరకు ఆ అవకాశం కరిష్మా కపూర్కు దక్కింది. రూ.5 కోట్ల బడ్జెట్తో నిర్మితమైన ఈసినిమా బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.76 కోట్లు వసూలు చేసిందని అంచనా. ఇదే చిత్రం 'ప్రేమ బంధం'గా తెలుగులో డబ్ అయింది.

రిపబ్లిక్ సినిమా CINEMA

# అలియా భట్తో సినిమా.. నాగ్ అశ్విన్ ఏమన్నారంటే!

**బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ నాగ్ అశ్విన్ ఓ సినిమా తీయనున్నట్లు వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై నాగ్ అశ్విన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.**




'కల్కి'తో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు నాగ్ అశ్విన్ దీంతో ఆయన తర్వాత ప్రాజెక్టుపై సినీప్రియుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ టాలెంటెడ్ దర్శకుడు బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్తో ఓ లేడీ ఓరియంటెడ్ సినిమా తీయనున్నారంటూ వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ కోసం అలియాతో చర్చలు కూడా జరిపినట్లు జోరుగా ప్రచారమవుతోంది. ఈవిషయంపై నాగ్ అశ్విన్ ఆంగ్ల మీడియాతో మాట్లాడారు. ఆ వార్తలన్నీ రూమర్సేనని స్పష్టంచేశారు. అలాగే తన తర్వాత సినిమా 'కల్కి2' అని అన్నారు. ప్రస్తుతం తాను 'కల్కి 2' పనుల్లో మాత్రమే బిజీగా ఉన్నట్లు చెప్పారు. దీంతో ఈ నాగ్ అశ్విన్ గతంలో కీర్తిసురేశ్తో 'మహానటి' తీసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఇదేతరహాలో అలియాతో కూడా ఓ సినిమా చేయనున్నట్లు కొన్ని రోజులుగా బాలీవుడ్ మీడియాల్లో వార్తలు వస్తోన్నాయి. ఈ విషయంపై నాగ్ అశ్విన్ క్లారిటీ ఇవ్వడంతో వాటికి చెక్ పడింది. ఇక ఆయన దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వచ్చిన 'కల్కి 2898 ఏడీ' విడుదలైన అన్ని ప్రాంతాల్లో ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడీ చిత్రం జపాన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జనవరి 3వ తేదీ జపాన్లో రిలీజ్ కానుంది. తాజాగా దీనికి సంబంధించిన టీజర్ను విడుదల చేయగా అక్కడ మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.మరోవైపు 'కల్కి' పార్ట్2 షూటింగ్ జనవరి, ఫిబ్రవరిలో మొదలుపెట్టే అవకాశం కనిపిస్తోంది. చిత్రీకరణ ప్రారంభమైన తర్వాత పార్ట్ 2కు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ ఇస్తామని నిర్మాతలు గతంలో తెలిపారు మొదటిభాగం చిత్రీకరణ సమయంలోనే రెండో పార్టు సంబంధించి కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. మరికొన్ని కీలక సన్నివేశాలు, వీఎఫ్ఎక్స్ పనులు పూర్తిచేయాల్సి ఉంది.

# ఆరోగ్యం

చలికాలం ప్రారంభమైంది. రానున్న రోజుల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. ఈ సీజన్లో సూర్య రశ్మి అంతగా ఉండదు. సూర్య రశ్మి లేకపోవడం వల్ల శరీరానికి కావాల్సిన విటమిన్ డి అందదు. విటమిన్ డి శరీరంలో కాల్షియం పెంచుతుంది. ఎముకల్ని బలంగా మార్చడానికి కాల్షియం, విటమిన్ డి చాలా అవసరం. కాల్షియం, విటమిన్ డి ఎముకల సాంద్రతను పెంచుతాయి. దీంతో.. బోలు ఎముకలు వంటి వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు. అంతేకాకుండా ఈ రెండు కండరాల బలాన్ని పెంచుతాయి. కాల్షియం నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపరుస్తుంది. రక్తం గడ్డకట్టడంలో సహాయపడుతుంది. హార్మోన్లు, ఎంజైమ్ల స్రావాన్ని నియంత్రిస్తుంది.

## 4 నెలల చలికాలంలో ఈ ఏడు పండ్లు తింటే.. 206 ఎముకలు బలపడతాయి..





## కాల్షియం కోసం ఏం తినాలి



ఆహారంలో కొన్ని పండ్లను చేర్చుకోవడం ద్వారా ఎముకలు దృఢంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వ్యవస్థాపకుడు, హెూలిస్టిక్ న్యూట్రిషనిస్ట్ ప్రియాంషి భట్నాగర్ ప్రకారం, చలికాలంలో నాలుగు నెలల పాటు పూర్తి కాల్షియం పొందడానికి కొన్ని పండ్లను డైట్లో చేర్చుకోవాలి. ఈ పండ్లను తింటే కాల్షియం స్థాయి పెరిగి ఎముకలు బలంగా మారతాయి. ఇంతకీ ఆ పండ్లు ఏంటో ఇక్కడ చుద్దాం.

## ఖర్జూరాలు..




ఖర్జూరాలు డ్రై ఫ్రూట్స్లో సూపర్ ఫుడ్ అని చెప్పొచ్చు. ఖర్జూరంలో ఎన్నో పోషకాలు ఉంటాయి. కాల్షియంతో పాటు ఇతర ఖనిజాల అద్భుతమైన మూలం. ఖర్జూరంలో ఐరన్, మినరల్, అమినో యాసిడ్స్, ఫాస్ఫరస్, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని, ఎముకలకు బలాన్ని అందిస్తాయి. 100 గ్రాముల ఖర్జూరాల్లో దాదాపు 64 కాల్షియం ఉంటుంది.

## కివి..



కివిలో కాల్షియం, విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఎముకలకు ప్రయోజనం చేకూరుస్తాయి. 100 గ్రాముల కివీ పండులో దాదాపు 34 %ఎస్త్ర% కాల్షియం ఉంటుంది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీంతో.. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఈ పండ్లలో విటమిన్ ఇ తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని ఎంతో మేలు చేస్తాయి.

## జామ..



జామపండులో ఎన్నో పోషకాలు ఉన్నాయి. చలికాలంలో జామపండు తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. జామపండులో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీంతో.. ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. రోగాలు రాకుండా అడ్డుకుంటుంది. ఇందులో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో.. మలబద్ధక సమస్యతో బాధపడేవారికి జామపండు అద్భుతంగా పనిచేస్తుంది. చలికాలంలో జామకాయ తినడం వల్ల శరీరానికి విటమిన్ డి, కాల్షియం అందుతాయి. 100 గ్రాముల జామపండులో దాదాపు 18 మిల్లీగ్రాముల కాల్షియం ఉంటుంది.

## అంజీర్..



అంజీర్ను పోషకాల గని అంటారు. విటమిన్ ఎ, విటమిన్ కే, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు అత్తి పండులో ఉన్నాయి. ఎండిన లేదా తాజా అత్తి పండ్లలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇవి చలికాలంలో శరీరాన్ని వెచ్చగా, ఎముకలు దృఢంగా ఉంచడంలో సహాయపడతాయి. 100 గ్రాముల ఎండిన అత్తి పండ్లలో 162 %ఎస్త్ర% కాల్షియం ఉంటుంది. అయితే 100 గ్రాముల తాజా అంజీర్లో 35 % కాల్షియం ఉంటుంది.

## నారింజ..



ఆరెంజ్ విటమిన్ సితో పాటు కాల్షియం యొక్క మంచి మూలం. ఆరెంజ్ జ్యూస్ తాగడం వల్ల శరీరానికి క్యాల్షియం అందడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. 100 గ్రాముల నారింజలో దాదాపు 40 % కాల్షియం ఉంటుంది. నారింజలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆరెంజ్ తినడం వల్ల ఎముకలతో పాటు దంతాలు కూడా బలపడతాయి..

## ఈ రెండు పండ్లు కూడా తినండి..



బొప్పాయి, స్ట్రాబెర్రీలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఈ రెండూ కాల్షియం పరిమాణం పెంచడంలో సాయపడతాయి. 100 గ్రాముల స్ట్రాబెర్రీలో దాదాపు 27 కాల్షియం ఉంటుంది. ఇక, బొప్పాయి తినడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరగవుతుంది. అంతేకాకుండా శరీరానికి కావాల్సిన కాల్షియం అందుతుంది.

గమనిక.ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.